క్లుప్తంగా

సద్వినియోగం చేసుకోండి


పౌష్టికాహార కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

గోస్పాడు: టీబీ వ్యాధి గ్రస్తులు పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్ డాక్టర్ వెంకటరమణ అన్నారు. ప్రధానమంత్రి టీబీ ముక్తభారత్ అభియాన్‌లో భాగంగా పట్టణంలోని టీబీ క్లినిక్‌లో గురువారం జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ శారదాబాయి ఆధ్వర్యంలో పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ డీఎల్ఏటీఓ కార్యాలయ డాక్టర్లు ముగ్గురిని దత్తత తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే దత్తత తీసుకున్న 15 మందికి కిట్లను అందజేశారన్నారు. డాక్టర్లు తేజశ్వని, పీటర్, వినయ్, పీపీఎం కో ఆర్డినేటర్ నాగార్జున రెడ్డి, సూపర్‌వైజర్ జయరామిరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా వినాయకుడి కల్యాణం

నంద్యాల(వ్యవసాయం): సంజీవ్ నగర్ రామాలయంలో గురువారం వినాయక చవితి పండుగను పురస్కరించుకొని శ్రీ భగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో శ్రీ సిద్ధి బుద్ధి సమేత వరసిద్ధి వినాయక కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులకు పండితులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు.

యూరియా కొరత సృష్టిస్తే చర్యలు

ఆళ్లగడ్డ : ఎరువుల దుకాణాల యజమానులు యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ రత్నకుమారి హెచ్చరించారు. గురువారం పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు తనిఖీ చేశారు. గోదాముల్లో నిలువ ఉన్న ఎరువులను తనిఖీ చేశారు. ఏడీఏ విజయ్‌కుమార్, ఎస్సై నగీనా, ఏఓ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

పాఠశాలలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు

శిరివెళ్ల: ఇసుకపల్లె ప్రాథమికోన్నత పాఠశాల పూర్వ విద్యార్థి కొట్టాలపల్లెకు చెందిన చిన్న నరసింహ్మడు (ఐడీబీఐ ఆపరేషన్ మేనేజర్)తో చొరవతో బ్యాంక్ మేనేజర్లు పాఠశాలకు విరాళాలను గురువారం అందజేశారు. పూర్వ విద్యార్థితో పాటు ఆదోని ఐడీబీఐ మేనేజర్ రాఘవేంద్రారెడ్డి, నంద్యాల ఐడీబీఐ మేనేజర్ వెంకట్రావ్‌లు కలిసి రూ. 1.75 లక్షలు విలువ చేసే మినరల్ వాటర్ ప్లాంట్, 20 కుర్చీలు, 20 టేబుళ్లను పాఠశాలకు విరాళంగా అందజేశారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో ప్రతిభ

నంద్యాల(న్యూటౌన్): నేషనల్ ఓపెన్ బాడీ బిల్డింగ్‌లో 85 కేటగిరి జూనియర్స్‌లో బంగారు పతకం, సీనియర్స్ కేటగిరిలో వెండి పతకం సాధించినట్లు క్రీడాకారులు షేక్ మహహ్మద్ అరీష్ అనే క్రీడాకారుడు గురువారం తెలిపారు. ఈనెల 24న బెంగళూరులో జరిగిన బెంగళూరు నెక్స్ట్ లెవెవ్ ఫిట్‌నెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ ఓపెన్ బాడీ బిల్డింగ్ పోటీల్లో పతకాలు సాధించినట్లు వివరించారు.

ప్రాధాన్యత క్రమం మార్చేందుకు అవకాశమివ్వాలి

నంద్యాల(న్యూటౌన్): డీఎస్సీ అభ్యర్థులు పోస్టుల ప్రాధాన్యత క్రమం మార్చుకునేందుకు అవకాశం కల్పించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, శివయ్య డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఎంపికైన అభ్యర్థులకు ఉన్నతమైన పోస్టు ఎస్ఏ, టీజీటీ, పీజీటీలలో నియామకమైన వారి స్థానాల్లో ఎస్‌జీటీలోని కింది ర్యాంకు వారికి అవకాశం ఇచ్చి నియామకాలు చేపట్టాలని కోరారు.

కృష్ణా జలాలను మళ్లించడం దారుణం

నంద్యాల(అర్బన్): బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ కాంప్లెక్స్‌లోని ఎస్సార్బీసీ రెగ్యులేటర్ ద్వారా ఎస్సార్బీసీ ప్రధాన కాల్వకు కృష్ణా జలాలు అందకుండా శాశ్వత అడ్డుకట్ట వేసి ఆ నీటిని ఎస్కేప్ చానల్‌కు మళ్లించడం సీమ వాసుల గొంతు నొక్కడమేనని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి విమర్శించారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ నిగ్గుతేల్చి సీమ హక్కులను కాపాడాలని కోరుతూ గురువారం రాష్ట్ర జలవనరుల శాఖ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశామని తెలిపారు.

పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు

దొర్నిపాడు: మండలంలో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ సావిత్రి తెలిపారు. గురువారం గుండుపాపల గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు.

పాడి రైతుల సంక్షేమమే ధ్యేయం

నంద్యాల(అర్బన్): విజయ డెయిరీకి పాలను అందించే పాడి రైతుల సంక్షేమమే ధ్యేయమని డెయిరీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పాడి రైతులకు నాలుగేళ్లలో రూ.17కోట్ల సాయం అందించామన్నారు. డెయిరీ ఉద్యోగులు, కార్మికులకు నాలుగేళ్లలో రూ.3.50 కోట్లు బోనస్ ఇచ్చామన్నారు.

పింఛన్ల తొలగింపుపై ప్రభుత్వం స్పందించాలి

నంద్యాల(అర్బన్): దివ్యాంగుల పింఛన్ల తొలగింపుపై ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమం చేపడుతామని వీహెచ్‌పీఎస్ (వికలాంగుల హక్కుల పోరాట సమితి) నంద్యాల జిల్లా అధ్యక్షుడు గంగాధర్‌శెట్టి హెచ్చరించారు. వీహెచ్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక రీడింగ్ రూం ఎదుట వీహెచ్‌పీఎస్ జెండాను ఆవిష్కరించారు.

సహకార సంఘాల్లో ఆన్‌లైన్ రశీదులు

శిరివెళ్ల: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కంప్యూటరైజేషన్ అయ్యాయని, రైతులకు ఆన్‌లైన్ రశీదుల పంపిణీ ప్రారంభమయ్యిందని కేడీసీసీ బ్రాంచి మేనేజర్ రేణుక తెలిపారు. గురువారం రైతులకు ఆన్‌లైన్ రశీదులను అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. ఇక నుంచి సహకార సంఘాలలో రుణాల మంజూరు, పంపిణీ, వ్యాపార లావాదేవీలను ఆన్‌లైన్‌లోనే జరుగుతాయన్నారు. సూపర్‌వైజర్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.


గోస్పాడులో వినాయక విగ్రహం


ఉట్టికొట్టి సంబరాలు చేసుకుంటున్న యువకులు


నంద్యాలలోని ఎస్‌బీఐ కాలనీలో పూజలందుకుంటున్న విఘ్నేశ్వరుడు


కలెక్టర్ కార్యాలయంలో మట్టి వినాయక విగ్రహానికి పూజలు చేస్తున్న కలెక్టర్ రాజకుమారి

వైభవంగా వినాయక చవితి వేడుకలు

వాడవాడలా కొలువుదీరిన గణనాథులు

- ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ
- జిల్లాలో మొత్తం 1200 విగ్రహాల ఏర్పాటు
- గత ఏడాది కంటే అధిక సంఖ్యలో విగ్రహాల కొలువు
- సాంస్కృతిక కార్యక్రమాలు, భగవద్గీత పారాయణం
- నంద్యాలలో ఆకట్టుకంటున్న శ్రీకదళీ పూర్ణఫల మహాగణపతి


వినాయకుడికి పూజలు చేస్తున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా


రామకృష్ణ పీజీ కళాశాలలో పూజలు చేస్తున్న దృశ్యం


నివర్తి నగర్‌లో పూజలందుకుంటున్న మహాగణపతి

నంద్యాల(వ్యవసాయం): వినాయక చవితి పర్వదినాన్ని నంద్యాల జిల్లాలో భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయమే పుణ్యస్నానాలు నిర్వహించుకొని ఇళ్లలో వినాయకుల విగ్రహాలకు 21పత్రాలతో పూజించి పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. జిల్లాలోని నియోజకవర్గాల్లో దాదాపుగా నంద్యాల జిల్లాలో 1200 విగ్రమాలను ఏర్పాటు చేశారు. సంజీవనగర్ రామాలయంలో భగవత్ సేవా సమాజ్ నెలకొల్పిన పచ్చి అరటికాయలతో శ్రీకదళీపూర్ణ ఫల మహాగణపతి సందర్శించి ఉత్సవాలను ప్రారంభించారు. బాలాజీ కాంప్లెక్స్‌లోని కల్యాణ మండపంలో సముద్రం నుంచి తెచ్చిన సప్తగవ్వలతో విశ్వశాంతి మహా గణపతిని ఏర్పాటు చేశారు. పల్లెల్లో మూడు రోజులు, పట్టణ ప్రాంతాల్లో ఐదు రోజు నిమజ్జనం చేయనున్నారు.

గోస్పాడు: మండలంలోని గ్రామాల్లో వినాయక చవితిని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. మండలంలో 76 విగ్రహాల దాకా ఏర్పాటు చేశారు. గురువారం విగ్రహాల వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. పసురపాడులో యువకుల ఆధ్వర్యంలో ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం నిమజ్జనం చేయనున్నారు.


సంజీవనగర్ రామాలయంలో అరటి కాయలతో చేసిన శ్రీ కదళీ పూర్ణఫల మహాగణపతి


రుద్రవరం అమ్మవారిశాలలో వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు


రామాలయంలో నూతన మౌక్తిక కవచ అలంకారంలో విఘ్నేశ్వరుడు


చాగలమర్రి రామాలయం వద్ద కొలువు దీరిన వినాయకుడు


క్రిష్టిపాడులో పూజలందుకుంటున్న బొజ్జగణేషుడు

వీధి వీధినా కొలువైన గణణాథులు


మండలూరులో నిమజ్జనానికి వినాయకున్ని తీసుకెళ్తున్న దృశ్యం


శిరివెళ్ల శివాలయంలో పూజలందుకుంటున్న గణనాథుడు


ఉయ్యాలవాడలో పూజలు అందుకుంటున్న గణనాథుడు


చాగలమర్రిలో అన్నదానం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు చక్రం ముల్లా షబ్బీర్ ఆహ్మాద్

చాగలమర్రి: వినాయక చవితి పండుగను పురస్కరించుకొని మండలంలోని ఆయా గ్రామాలలో వీధి వీధినా వినాయక విగ్రహాలను భక్తులు మండపాలు ఏర్పాటు చేసి గణనాథులను కొలువు దీర్చి విశేష పూజలు చేశారు. మండలంలో 89, చాగలమర్రిలో 24 వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. స్థానిక ఎస్సీ కాలనీ, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలకుప్రముఖ వ్యాపార వేత్త వైఎస్సార్‌సీపీ నాయకుడు చక్రం ముల్లా షబ్బీర్ అహ్మద్ నగదు విరాళాన్ని అందించారు. అలాగే అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మతసామరస్యాన్ని చాటుకున్నారు.

- దొర్నిపాడు: మండలంలో వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలో మొత్తం 65 విగ్రహాలు కొలువుంచారు.
- శిరివెళ్ల: మండలంలో 105 మండపాలలో గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేస్తున్నారు. శిరివెళ్లలో 16, గోవిందపల్లె 20, యర్రగుంట్ల 18, బోయలకుంట్ల 6 చోట్ల మండపాలు ఏర్పాటయ్యాయి. గుంప్రమాన్‌దిన్నె, చెన్నూరు ,కోటపాడులలో 5 చొప్పున విగ్రహాల ఏర్పాటు చేశారు. జీనేపల్లె 1, గంగవరం, మహదేవపురంలలో 4 చొప్పున, మోత్కలపల్లె 3, వెంకటాపురం 6 చోట్ల విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఈ నెల 29న నిమజ్జనం జరగనుంది.
- ఉయ్యాలవాడ : మండల కేంద్రమైన ఉయ్యాలవాడలో 11 చోట్ల, గ్రామాలలో సైతం ప్రతి వీధిలో గణేష్ ప్రతిమలు 50 చోట్ల ప్రతిష్ఠించారు. వేద పండితులు శాస్త్రోక్తంగా పూజలు చేసి తీర్థ ప్రసాదాలు భక్తులకు అందజేశారు.
- రుద్రవరం: మండలంలో దాదాపు వంద విగ్రహాలను కొలువుదీర్చారు. ఆయా గ్రామాల్లోని విగ్రహాలకు విశేష పూజలతో పాటు మండపాల వద్ద అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అలాగే మండలంలోని మండలూరు, టీ.లింగదిన్నె, తిప్పారెడ్డిపల్లె గ్రామాల్లో గురువారం వినాయక విగ్రహాల నిమజ్జనం గావించారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయకపోతే ఉద్యమం

నంద్యాల(న్యూటౌన్): పెరిగిన విద్యుత్ చార్జీలను తగ్గించి స్మార్ట్ మీటర్లను రద్దు చేయకపోతే ఉద్యమం తప్పదని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్, ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మురళీధర్ అన్నారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విద్యుత్ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ అధికారంలో లేనప్పుడు స్మార్ట్ మీటర్లు ఇళ్లకు బిగించేందుకు వస్తే పగలగొట్టండి అని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టీడీపీ చెప్పిందని, ప్రస్తుతం మీటర్ల ఏర్పాటుకు పూనుకుంటుండటం దుర్మార్గమన్నారు. విద్యుత్ ఉద్యమంలో అమరులైన పార్టీ నాయకులు రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి ఆశయాలను కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు. నాయకులు శ్రీనివాసులు, హరినాథ్, లక్ష్మీదేవి, అలాంబాషా, వెంకటకృష్ణ, మౌలాలి, ప్రసాద్ పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న సీపీఎం నాయకులు

సీపీఎం ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ..

స్మార్ట్ మీటర్ల విధానానికి స్వస్తి పలకాలని, లేని పక్షంలో ప్రజల ఆగ్రహాన్ని చవి చూడాల్సి వస్తుందని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో అమరవీరుల సాక్షిగా చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు పుల్లా నరసింహులు, తోటమద్దులు, రాజునాయక్, మౌలాలి, జైలాన్, రామరాజు, మాదాల శ్రీనివాసులు పాల్గొన్నారు.

స్థలం కబ్జాకు యత్నం

నంద్యాల(అర్బన్): నంద్యాలలో ఖాళీ స్థలం కనపడితే చాలు కబ్జాలకు గురవుతున్నాయి. పట్టణంతో పాటు రూరల్ ప్రాంతాల్లో సొంత స్థలాలను కాపాడుకోవడానికి యజమానులు హడలి పోతున్నారు. స్థానిక చాబోలు గెలివి, బద్రిశెట్టి కుటుంబాలకు సర్వేనం .172/1లో 75 సెంట్ల స్థలం ఉంది. ఎవరూ కబ్జా చేయకుండా కొంత కాలం క్రితం ప్రహరీ ఏర్పాటు చేశారు. అయితే శిల్పానగర్ ప్రాంతానికి చెందిన బిల్డర్ ఉరుకుందు నకిలీ డాక్యుమెంట్లతో మంగళవారం రాత్రి 50 మంది మహిళల సాయంతో స్థలాన్ని ఆక్రమించాడు. బుధవారం ఆక్రమిత స్థలంలో పునాదులు వేస్తుండగా విషయం తెలుసుకున్న గెలివి రామకృష్ణ, చైతన్య వెళ్లి అడ్డుకున్నారు. స్థలం తనదేనంటూ ఉరుకుంద వాగ్వాదానికి దిగి దాడి చేయడంతో రామకృష్ణ, చైతన్యకు గాయాలయ్యాయి. న్యాయం చేయాలంటూ వైశ్య సంఘీయులతో బాధితులు ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేశారు. రూ.కోట్ల విలువజేసే స్థల ఆక్రమణకు దిగిన ఉరుకుందుకు స్థానిక అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధుల అండదండలు ఉన్నట్లు సమాచారం.


వివాదానికి కారణమైన స్థలం

ఉరుకుందుపై కేసు నమోదు..

స్థలం ఆక్రమించడమే కాకుండా తమపై దాడి చేసి గాయపరిచాడని బాధితుడు రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ ఈశ్వరయ్య గురువారం తెలిపారు. విచారణ జరిపి నిందితుడిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

భద్రతా ఏర్పాట్లు చేపట్టాలి

చాగలమర్రి: మండలంలో గణేష్ నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు అధికారులు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని ఎంపీపీ వీరభద్రుడు అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రమైన చాగలమర్రిలోని ఎంపీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం సందర్భంగా కేసీ కెనాల్ వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటలు చోటు చేసుకోకుండా నిమజ్జన ఘాట్ వద్ద భక్తుల సౌకర్యార్థం బారికేడ్లు ఏర్పాటు చేయాలని, గజ ఈత గాళ్లను సిద్ధంగా ఉంచాలని కోరారు. సర్పంచ్ గోవిందయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులు, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

గురురాజలో క్రీడా పోటీలు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక గురురాజ పాఠశాలలో ఈనెల 29వ తేదీన మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా గురువారం విద్యార్థులకు క్రీడా పోటీలను పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి, మౌలాలి రెడ్డి ప్రారంభించారు. వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, సందీప్, సంజీవ్, ముని, శశి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పీఆర్‌సీ ఏర్పాటు చేయాలి

గోస్పాడు : 12వ పీఆర్‌సీని వెంటనే నియమించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న కరువుభత్యం విడుదల చేయాలని, ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించరాదన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు విజయరావు,జిల్లా నాయకులు సురేష్ కుమార్ పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): నకిలీ పత్రాలు సృష్టించి భూకబ్జాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లా కేంద్రంలో రోజురోజుకు కబ్జాదారులు పెట్రేగిపోతున్నారన్నారు. అమాయకులపై దాడులకు పాల్పడుతున్నారని, ఇందుకు పట్టణంలో ప్రముఖ వ్యాపార వేత్త గెలివి రామకృష్ణపై జరిగిన దాడి ఘటనే ఉదాహరణ అన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనకు కృషి

గోస్పాడు: మలేరియా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రావు తెలిపారు. గురువారం నంద్యాల పట్టణంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షా కాలం కావడంతో పరిసరాలు, వీధులు అపరిశుభ్రంగా ఉంటాయన్నారు. ఈ ఏడాది దోమల ఆవాసాలు ఉన్న మూడు కేంద్రాలను గుర్తించి డ్రోన్ ద్వారా లార్వా నివారణ మందు పిచికారీ చేయించినట్లు తెలిపారు.

యూరియా సమస్య తలెత్తనీయొద్దు

- భూ సమస్యలు పెండింగ్ లేకుండా పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ రాజకుమారి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ

నంద్యాల: జిల్లాలో ఎక్కడా యూరియా సమస్య తలెత్తకూడదని జిల్లా కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. గురువారం అమరావతి సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఎంఐ ట్యాంకులు, గ్రౌండ్ వాటర్, పీఎం- కుసుమ్‌కు సంబంధించిన భూ సమస్యలు, పెన్షన్లు, సానుకూల ప్రజాదృక్పథం, యూరియా లభ్యత, ధర నిర్ణయం, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నంద్యాల కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు అవసరమైన యూరియా పుష్కలంగా ఉందని చెప్పారు. యూరియాను అధిక ధరలకు విక్రయించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల మరమ్మతులు, కాలువలలో పూడికతీత తదితర పనులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు చేపట్టాలని ఆదేశించారు. భూగర్భ జలాలు పెంచేందుకు నీటి సంరక్షణ పనులను విరివిగా చేపట్టాలన్నారు. పెన్షన్ల సమస్యపై లబ్ధిదారులతో సానుకూలంగా మానవతా దృక్పథంతో మాట్లాడి లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. జిల్లాలో వంద శాతం భూ సమస్యలు పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చెప్పారు.

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నర్సింగరావు

నంద్యాల(వ్యవసాయం): బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నంద్యాలకు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు, సీనియర్ న్యాయవాది ఖాదరబాద్ నర్సింగరావును నియమించినట్లు గురువారం పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడినట్లు ఆయన తెలిపారు. ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

వీఆర్‌ఏ మృతి

రుద్రవరం: స్థానికంగా వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తున్న దూదెకుల నాగన్న(59) గురువారం గుండె పోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది రీసర్వే డీటీ హుసేని, వీఆర్‌ఓలు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దహన సంస్కారాల నిమిత్తం రూ.10వేలు, అలాగే వీఆర్‌ఏల తరఫున రూ.5వేల నగదును అందజేశారు. వీఆర్‌ఓలు సంజీవ రెడ్డి, నరసింహ, విశ్వనాథ్, అంకాల్, యువకాంత్, వెంకటేశ్వరు పాల్గొన్నారు.